
ప్రజాశక్తి
శనివారం 25 అక్టోబర్ 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





పెరుగుతున్న రాళ్లపాడు నీటిమట్టం

ప్రజాశక్తి-లింగసముద్రం: రాళ్లపాడు ప్రాజెక్టు నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి 18.5 అడుగులకు చేరడంతో ప్రాజెక్టు జలకళ వచ్చింది. గురువారం రాత్రి ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు ప్రాజెక్టులోకి నీరు రావడంతో నీటిమట్టం పెరుగుతూ వచ్చింది. ప్రాజెక్టులోకి 2000 క్యూసెక్కుల నీరు వస్తుందని ప్రాజెక్టు డిఇ వెంకటేశ్వర్లు ప్రాజెక్టు వద్ద ఉంటూ ఎప్పటికప్పుడు పరిస్థితులను ఉన్నతాధికారులకు తెలియజేస్తూ అప్రమత్తంగా ఉన్నామని చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండే దిశగా నీరు రావడంతో ఆయకట్టు రైతాంగం హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండితే గేట్లు ఎత్తే అవకాశం ఉన్నందున అధికారులు మన్నేరు ప్రాంతంలో ఉన్న లింగసముద్రం, గుడ్లూరు, వలేటివారిపాలెం, ఉలవపాడు, సింగరాయకొండ గ్రామాల్లోని ప్రజలను అప్రమత్తం చేశారు.



ప్రాజెక్టును పరిశీలించిన డిఎస్పి

రాళ్లపాడు ప్రాజెక్టును కందుకూరు డిఎస్పి బాలసుబ్రమణ్యం శుక్రవారం పరిశీలించారు. ప్రాజెక్టు నీటిమట్టం పెరగడంతో ఆయన ప్రాజెక్టును సందర్శించి వివరాలను అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు.

రమేష్ "ఆశలు అగ్గి"..!

- బస్సు యాక్సిడెంట్‌లో మాంసపు ముద్దలు
- గోళ్లవారిపల్లెలో ఆర్తనాదాలు
- పలువురు సంతాపం

ఆ కుటుంబం ఆత్మీయత, అనురాగాలకు నెలవు..బతుకుదెరువు కోసం బెంగుళూరు వెళ్లారు..అక్కడే చిన్నపాటి ఉద్యోగం చేస్తూ..తన భార్య, పిల్లలను పోషించుకోవడంతోపాటు, సొంత ఊర్లో ఉన్న తల్లిదండ్రులకు బాసటగా నిలుస్తున్నారు... ఇటీవల దసరాకు భార్య పిల్లలతో, ఊరికొచ్చి స్నేహితులు, తల్లిదండ్రులు, బంధువులు, ఆత్మీయులతో ఆనందంగా గడిపారు...స్నేహితుడి కుటుంబంతో కలిసి హైదరాబాద్ వెళ్లి తిరిగి మళ్లీ బెంగుళూరు వెళుతోన్న సమయంలో అగ్ని ప్రమాదం ఆ కుటుంబాన్ని తిరిగిరాని లోకాలకు తీసుకెళ్లింది. మరి కొద్ది గంటల్లోనే ఇంటికి చేరుకోవాల్సిన ఆ కుటుంబం అగ్నికి ఆహుతైంది...నిద్రలోనే భార్య, ఇద్దరు పిల్లలతో ఇంటి పెద్ద మాంసం ముద్దలుగా మారారు.. గుర్తుపట్టడానికి వీల్లేని మృత దేహాలు.. ఏ మాంసం ముద్ద ఎవరిదో తెలియని కోలేని దయనీయ స్థితి...ఈ సంఘటనతో వింజమూరు మండలం, గోళ్లవారిపల్లె గొల్లు మంటూ కన్నీరు పెట్టింది..



సజీవదహనమైన రమేష్ కుటుంబ సభ్యులు (ఫైల్)



దగ్ధమవుతున్న బస్సు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ఉదయగిరి నియోజకవర్గంలోని వింజమూరు మండలం, గోళ్లవారిపల్లె గ్రామానికి చెందిన గోళ్ల మాలకొండయ్య, సుశీల దంపతులకు నలుగురు సంతానం.. ముగ్గురు కుమార్తెలు, ఒక్క కుమారుడు గోళ్ల రమేష్ వింజమూరులోని రవి స్కూల్‌లో చదువుకున్నారు. అక్కడే ఇంటర్ వరకు పూర్తి చేశారు. ముగ్గురు అక్కల పెళ్లిలు చేశారు. తండ్రికి వయస్సు పై పడడంతో తల్లిదండ్రుల చేదోడు వాదోడుగా ఉండడానికి పదేళ్ల క్రితం బెంగు ళూరు వెళ్లారు. అక్కడ హిందుస్తాన్ కంపెనీలో సేల్స్‌లో పని చేసుకుంటూ అప్పు డప్పుడు వచ్చి తల్లిదండ్రులను చూసి వెళుతున్నాడు. ఎనిమిది సంవత్సరాల క్రితం అదే గ్రామ ంలో ఉంటున్న తన పెద్ద అక్క కుమార్తె అనుషను పెళ్లి చేసుకున్నాడు. వారికి కుమారుడు శశాంత్, కుమార్తె మన్విత్ పుట్టారు.. బెంగుళూరులో ఉంటూ అప్పుడప్పుడు సొంత ఊరు వస్తున్నారు. ఇదే క్రమంలో ఇటీవల దసరాకు తన భార్య ఇద్దరు పిల్లలతో గోళ్లవారిపాళెం వచ్చారు. పండుగ ఇక్కడే ఉండి అందరితో కలిసి మెలిసి తిరిగారు. తల్లిదండ్రులను, తన అక్కల తోను ఎంతో ప్రేమగా చూసుకుంటూ ఆప్యాయంగా ఉండేవారు. ఇటీవల బెంగుళూరు వెళ్లి,అక్కడ నుంచి స్నేహి తుని కుటుంబంతో కలిసి హైదరాబాద్ విహార యాత్రకు రమేష్ కుటుంబంతో కలిసి వెళ్లారు.

నిద్రలోనే అగ్నికి ఆహుతి...!


గోళ్ల రమేష్ కుటుంబం దుత్తలూరు మండలం, కొత్తపేట గ్రామానికి చెందిన స్నేహితులు రమేష్ కుటుం బంతో కలిసి మూడు రోజుల క్రితం బెంగుళూరు నుంచి హైదరాబాద్‌కు టూర్‌కు వెళ్లా రు. హైదరాబాద్‌లో సరదాగా కలియ తిరిగారు. భార్య, పిల్లలతోపాటు, స్నేహితుని కు టుం బంతోనూ సంతోషంగా గడిపారు. గురు వారం రాత్రి 11 గంటలకు హైదరాబాద్ నుంచి వేమూరి కావేరి ట్రావెల్ బస్సులో బెంగుళూరు బయల్దే రారు. అందరూ గాఢ నిద్రలోకి జారుకున్నారు. మరో నాలుగు గంటలకు గమ్య స్థానం చేరాల్సి ఉంది. కర్నూలు జిల్లా కల్లూరు మండలం, చిన్న టేకూరు గ్రామం వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో బస్సులో మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా దావానలంలా వ్యాపించ డంతో బస్సులో 19 మంది అగ్నికి ఆహుతి అయ్యారు. స్నేహితుడు రమేష్ తమ భార్య పిల్లలతో బస్సులోని నుంచి బయటపడ్డారు. గోళ్ల రమేష్ (31)తోపాటు భార్య అనూష (27) కుమారుడు శశాంత్ (7) కుమార్తె మన్విత్ (4) బస్సులో చిక్కుకొని మంటల్లో కాలి బూడిదగా మారారు. గుర్తుపట్టలేని విధంగా, మాంసం ముద్దలే మిగిలాయి.. డిఎన్ఎ పరీక్షల ద్వారానే గుర్తుపట్టాల్సి ఉంది. మరో కొద్ది గంటలకు ఇంటికి చేరాల్సిన వారు మళ్లీ తిరిగిరాని లోకానికి వెళ్లిపోయారు.

ఆ పల్లెలో మిన్నంటిన ఆర్తనాదాలు..!

కర్నూల్ జరిగిన బస్సు ప్రమాదవార్త తెలియగానే వింజమూరు మండలం, గోళ్లవారిపల్లెలో ఆర్తనాదాలు మిన్నంటాయి. కుమారుడి కుటుంబం మొత్తం అగ్ని ప్రమాదంలో చనిపోయారని తెలియడంతో తండ్రి మాలకొండయ్య, తల్లి సుశీల భోరున విలపించారు. స్నేహితులు, బంధువులు, మిత్రులు, గ్రామస్తులు ఈ సంఘటనతో శోక సంద్రంలో మునిగిపోయారు. ఇటీవలే పండుగకు వచ్చి వెళ్లారంటూ బోరు మన్నారు. అనూష అన్న కూడా ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు. ఈ కుటుంబం పరిస్థితి దయనీయంగా మారింది. వృద్ధ తల్లిదండ్రులకు చేయూతగా ఉన్న కుమారుడు, కుటుంబం చనిపోవడంతో ఆ కుటుంబం పరిస్థితి చూసి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వార్తతో స్థానిక ఎంఎల్ఎ కాకర్ల సురేష్ కుటుం బాన్ని పరామర్శించారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పి.నారాయణ ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంఎల్ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రతోపాటు అందరూ ఆ కుటుంబానికి సానుభూతి, సంతాపం తెలిపారు...

గ్యాంగ్ వర్క్స్ పనుల పర్యవేక్షణ

ప్రజాశక్తి-నెల్లూరు కార్పొరేషన్: నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా సండే మార్కెట్ ప్రాంతంలో సుబ్రహ్మణ్య స్వామి దేవాలయం సమీపంలో రోడ్డుపై నిలిచి ఉన్న వర్షపు నీరు డ్రెయిను కాలువల ద్వారా సాఫీగా ప్రవహించేందుకు నిర్వహిస్తున్న గ్యాంగ్ వర్క్స్ పనులను పర్యవేక్షించారు. వరద నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న మెట్లు, ర్యాంపుల నిర్మాణాలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీరు రోడ్లపై నిలవకుండా అవసరమైన అన్ని చర్యలను వేగవంతం చేయాలని, వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా నిరంతరం పర్యవేక్షించాలని సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు.



నగదు బహుమతిని అందజేస్తున్న దృశ్యం

విద్యార్థులకు నగదు బహుమతి అందజేత

ప్రజాశక్తి - లింగసముద్రం: తిమ్మారెడ్డి పాలెం గ్రామానికి చెందిన పాఠశాల పూర్వ విద్యార్థి (1966 -71)మాజీ డైరెక్టర్ డిఆర్‌డిఒ ఢిల్లీ జడ శ్రీనివాసులు జ్ఞాపకార్థం ఆయన సతీమణి రతన్ విద్యార్థులకు నగదు బహుమతులను అంద జేశారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమ్మడిశెట్టి మాధవరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన దేవూరి కిషోర్‌కు రివేష్, ఏసుపోగు శృతికి రివేష్, అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ దగ్గు రవి, లింగసముద్రం మాజీ సర్పంచ్ ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావు, జడ శ్రీనివాసులు, బంధువులు, ఉపాధ్యాయులు ఎం.కొండయ్య, కే.వెంకటేశ్వర్లు, కే.ప్రభాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్ ని విమర్శించే అర్హత లేదు

ప్రజాశక్తి-నెల్లూరు కార్పొరేషన్: మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని విమర్శించే అర్హత ఉడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసరెడ్డికి లేదని వైఎస్ఆర్‌సిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు నెల్లూరు సిటీ 13వ డివిజన్ కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున అన్నారు. శ్రీనివాసులు రెడ్డి కి సొంత పార్టీ లోనే గుర్తింపు లేదన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాది లోనే లక్షా ముప్పై వేల శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిన ఘనత జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు.

టెట్ తప్పనిసరి చేయడం సరికాదు

-ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు: ఇప్పటికే ప్రభుత్వ సర్వీస్‌లో ఉన్న సీనియర్ ఉపాధ్యాయుల విషయంలో టెట్ తప్పనిసరి చేయాలన్న ప్రభుత్వ ఆలోచన అర్థం కాని విషయమని, ఈ ఆలోచన ప్రభుత్వం విరమించుకోవాలని యుటిఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం ఈ మేరకు యుటిఎఫ్ జిల్లా కమిటీ పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేసింది. ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ఉపాధ్యాయులు అప్పటికే ఉద్యోగంలోకి రావడానికి అవసరమైన విద్యార్హతలు, వృత్తి విద్యార్హతలు కలిగి, పోటీ పరీక్షల్లో విజయం సాధించి నియామకం పొందారన్నారు. అంటే వీళ్ల బోధనా సామర్థ్యాన్ని అప్పుడే ప్రభుత్వం పరీక్షించి, అంగీకరించిందే అన్నారు. అంతేకాకుండా ఆర్‌టిఈ 2009 చట్టం అమలు ఏప్రిల్ ఒకటి 2010 నుండి జరిగిందని, అటువంటి చట్టం రూపొందించక ముందు నియామకం పొందిన ఉపాధ్యాయులకు చట్టం వర్తింపజేయడం సమంజసం కాదన్నారు. ఇక విద్యార్థులకు బోధించగలరా? లేదా? అనే ప్రశ్నే ఉండదని, ఎందుకంటే ఏళ్ల తరబడి వృత్తిలో అనుభవం, అంకితభావం, తరగతి గదిలో పొందిన ప్రాక్టికల్ పరిజ్ఞానం వీళ్లకున్న ప్రధాన బలమన్నారు. అటువంటి వారికి టెట్ అవసరమని చెప్పడం ఎంత వరకు న్యాయమన్నారు. టెట్ పరీక్షలో ఉత్తీర్ణత పొంది ఉపాధ్యాయులుగా నియామకం పొందిన వారి కంటే పదేళ్ల అనుభవం ఉన్న సీనియర్లు బోధనలో పిల్లల మనస్తత్వం అర్థం చేసుకోవడంలో పాత్యాంశం అందించడంలో ఎంతో దిట్టలన్నారు. అలాంటి సీనియర్లను మళ్లీ పరీక్షల పేరుతో మానసిక ఆందోళనకు గురిచేయడం సమయాన్ని వృథా చేయడం,బోధనా సమయాన్ని తగ్గించడం తప్ప మరే ప్రయోజనం లేదన్నారు. పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, తమిళనాడు, కేరళ ప్రభుత్వాలు ఇప్పటికే సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయగా ఏపి ప్రభుత్వం మాత్రం ఆదిశగా ఎందుకు ఆలోచన చేయలేదని ప్రశ్నిం చారు. ఉభయ సభలు ఆమోదం పొందిన బిల్ ను సుప్రీం కోర్టుకు సబ్మిట్ చేసినట్టయితే మినహాయింపు పొందవచ్చని ఆ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్. నవ కోటేశ్వరరావు,జిల్లా అధ్యక్షులు వీవీ శేషులు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వి. చలపతి శర్మ డిమాండ్ చేశారు.

రాళ్లపాడును పరిశీలించిన శివరాం

ప్రజాశక్తి-లింగసముద్రం: తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు రాళ్లపాడు ప్రాజెక్టులోకి నీరు చేరడంతో కందుకూరు మాజీ శాసనసభ్యులు డాక్టర్ దివి శివరాం హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన ప్రాజెక్టును సందర్శించి అధికారుల ద్వారా వివరాలు అడిగి తెలుసు కున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తుందన్నారు.పలుమార్లు దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకర మన్నారు.ప్రాజెక్టు ద్వారా 24 వేల ఎకరాల భూమికి సాగునీటిని 90 గ్రామాలకు తాగునీటిని సరఫరా జరుగు తున్నప్పటికీ ప్రాజెక్టు నిర్వాహ ణలో లోపాలు కనిపిస్తున్నాయన్నారు. ప్రాజెక్టులో నీరు లేని సమయంలో మర మ్మతులు చేపట్ట కుండా అధికారులు కాలయాపన చేయడం వల్ల ఈరోజు అనేక సమస్యలు వస్తు న్నాయన్నారు. తక్ష ణమే సిబ్బందిని నియ మించేలా ఉన్నతాధి కారులు చర్యలు చేపట్టాలని కోరారు కార్యక్ర మంలో రాళ్లపాడు పరిరక్షణ కమిటీ అధ్యక్షులు మాధ వరావు, పాలేటి కోటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న శివరాం

జిల్లాను అన్నిరంగాల్లోనూ అగ్రపథంలో నిలుపుదాం

ప్రజాశక్తి-నెల్లూరు: అన్ని రంగాల్లో జిల్లాను అగ్రపథంలో నిలిపేందుకు అందరం కలిసి కృషి చేద్దామని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కలెక్టర్ హిమాన్షు శుక్లా కు సూచించారు. శుక్రవారం స్థానిక సంతపేటలోని దేవాదాయ శాఖా మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలెక్టర్ హిమాన్షు శుక్ల మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వారు జిల్లాలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. గత ఐదు రోజులుగా జిల్లాలో కురిసిన భారీవర్షాల ప్రభావం, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తీసుకున్న తక్షణ చర్యల వివరాలను కలెక్టర్ మంత్రికి వివరించారు.ముఖ్యంగా భారీ వర్షాల నేపథ్యంలో సోమశిల ప్రాజెక్ట్ ,తాగునీటి సరఫరా, విద్యుత్ అంతరాయం లేకుండా తీసుకున్న చర్యలు, ఎప్పటికప్పుడు డ్రెయిన్స్ పూడికతీయడంతో వాహనదారులు, పాదచారులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టడం జరిగిందని కలెక్టర్ మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో జిల్లా అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఈ సందర్భంగా మంత్రి ఆనం కలెక్టర్ కు సూచించారు.



మంత్రితో మాట్లాడుతున్న కలెక్టర్

28న ర్యాలీ విజయవంతం చేయండి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి: ఈనెల 28న జరిగే ర్యాలీని విజయవంతం చేయాలని వైసిపి రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత కోరారు. శుక్రవారం వైసిపి జిల్లా కార్యాలయంలో మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను నిరసిస్తూ, వైసిపి ప్రజా ఉద్యమం సర్వేపల్లి నియోజకవర్గానికి సంబంధించిన ర్యాలీ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ నెల 28వ తేదీ మంగళవారం, ఉదయం 10గంటలకు వెంకటాచలం మండల కేంద్రంలోని సర్వేపల్లి క్రాస్ రోడ్డు నుండి ఎమ్మార్వో కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి, వినతి పత్రం సమర్పించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరణ చేసి రేపటి భావితరాలకు వైద్య విద్యను దూరం చేస్తుందన్నారు. . కూటమి ప్రభుత్వం ప్రజల గురించి పట్టించుకోకుండా, ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. . ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్యం అందించి ఆదుకోవాల్సింది పోయి, ప్రయివేట్ పరం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వపు నిర్ణయాలపై ప్రజలు నిరసిస్తున్నా, పట్టించుకోకుండా పెడిచెవిన పెట్టడం అన్యాయం. అన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం

ప్రజాశక్తి-నెల్లూరు కార్పొరేషన్: నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం కార్యక్రమాన్ని కమిషనర్ వై.ఓ నందన్ నిర్వహించారు. నెల్లూరు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి సందేహాలు, ఫిర్యాదులు, తదితర అంశాల గురించి అవగాహన కల్పించేందుకు ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా ఓపెన్ ఫోరం కార్యక్రమాన్ని ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్నా మన్నారు. అందులో భాగంగా ఈరోజు వివిధ అంశాలపై 15 మంది పౌరులకు ఓపెన్ ఫోరం కార్యక్రమం ద్వారా సందేహాల నివృత్తి చేసి అవగాహన కల్పించామని, భవన నిర్మాణాలకు సంబంధించి వివిధ సమస్యలకు పరిష్కారం అందించామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ సిటీ ప్లానర్ హిమబిందు, డిప్యూటీ సిటీ ప్లానర్ రఘునాథరావు, ఏ.సీ.పీ.లు, బిల్డర్లు, లైసెన్సుడ్ టెక్నికల్ పర్సన్స్, టిపిబిఒలు, వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాసమస్యను పట్టించుకోని పాలకులు

-16 సంవత్సరాల పోరాటంపై స్పందించని ప్రభుత్వం

ప్రజాశక్తి-నెల్లూరు: గడిచిన 16 సంవత్సరాలుగా చింతారెడ్డిపాళెం జంక్షన్ ప్రాంతంలోని మినీ బైపాస్ రహదారికి అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించి చుట్టు పక్కల ప్రజల ప్రాణాలను కాపాడాలని రాజకీయ పార్టీలకు అతీతంగా స్థానిక నాయకులు, ప్రజలు పోరాటం చేస్తున్నా పాలకులకు చీమకుట్టినట్లు అయినా లేదని, సమస్యకు పరిష్కారం చూపడంలో విఫలమవుతున్నారని ఫ్లై ఓవర్ బ్రిడ్జి సాధన కమిటీ పేర్కొంది. శుక్రవారం మెడికవర్ వైద్యశాల, చింతారెడ్డిపాళెం జంక్షన్ ప్రాంతంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి సాధన కమిటీ నిరసన కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా ఫ్లై ఓవర్ బ్రిడ్జి సాధన కమిటీ కన్వీనర్ కాయంబు శ్రీనివాసులు,కో కన్వీనర్ కొట్టె రామ్మూర్తి మాట్లాడుతూ చిల్డ్రన్స్ పార్కు నుంచి చింతారెడ్డి పాళెం వేళ్లే మార్గంలో ఉన్న జాతీయ రహదారికి అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని పోరాటం చేసినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడం దారుణమన్నారు. గతంలో ఈ ప్రాంతంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించేందుకు ప్రభుత్వం అంగీకరించినప్పటికీ కొన్ని కారణాల వల్ల ఆ బ్రిడ్జి మరో ప్రాంతానికి తరలించారని, ప్రతినిత్యం ఈ జంక్షన్ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఈ ప్రమాదాల కారణంగా అనేక మంది తమ కుటుంబానికి చెందిన పెద్దలను కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులెదుర్కొంటున్నారన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం ఆలకించి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలన్నారు. నవంబరు 2వ తేదీన ఫ్లై ఓవర్ బ్రిడ్జి సాధన కమిటీ సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నామన్నారు.ఈ సమావేశానికి ప్రజలు సైతం హాజరు కావాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో గురుబ్రహ్మం, శివకుమార్‌రెడ్డి, జనార్ధన్, శంకర్, కత్తి శ్రీనివాసులు, పరశు రామిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, షంషుద్దీన్, కట్టా సతీష్ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలుచేస్తున్న నాయకులు

మోపాడులో రచ్చబండ, సంతకాల సేకరణ


ప్రజాశక్తి-కందుకూరు: మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా రచ్చబండ, కోటి సంతకాల సేకరణ, గ్రామ కమిటీల ఏర్పాటు కందుకూరు మండలం మోపాడు గ్రామ పంచాయతీలో శుక్రవారం జరిగింది.మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు, మాజీ శాసనసభ్యులు కందుకూరు నియోజకవర్గ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ ఆదేశాలతో కందుకూరు మండలం లోని మోపాడు గ్రామంలోని ప్రజలకు మెడికల్ కాలేజీలు ప్రయివేటీకరణ చేస్తే కలిగే నష్టాలను గురించి వివరించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ను ప్రారంభించి సంతకాలు సేకరించారు. అనంతరం పార్టీ గ్రామ కమిటీల గురించి చర్చించారు. కార్యక్రమంలో కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు ఈదర రమేష్ బాబు, జిల్లా జనరల్ సెక్రెటరీ తోకల కొండయ్య, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ చీమల వెంకట రాజా, దొడ్డంరెడ్డి మదన్ మోహన్ రెడ్డి, పులిచర్ల పవన్ కుమార్ రెడ్డి, బొల్లిబోయిన వేణు, తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల్లో పరిశీలన

ప్రజాశక్తి-ఉలవపాడు: అల్పపీడనం కారణంగా గతవారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఉలవపాడు మండలం, మన్నేటికోట తుపాన్ సెంటర్లో ఏర్పాటు చేసిన ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలలో తిరుపతి గుంట గిరిజన కాలనీ వాసులను శుక్రవారం కందుకూరు సబ్ కలెక్టర్ దామర హిమవంశీ పరిశీలించారు. గిరిజన వాసులకు భోజన సదుపాయాలు అందజేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపరితల ప్రాంతాల నుండి వస్తున్న నిరంతరం ప్రవాహాల కారణంగా రాళ్లపాడు ఆనకట్ట నుండి మన్నేరు నది పరివాహక ప్రాంతం పై ప్రవహిస్తున్న నీటి ప్రవాహాన్ని ఆయన పరిశీలించారు. సందర్భంగా ఈ సందర్భంగా ఆయన ఉలవపాడు మండల ప్రజల అప్రమత్తంగా ఉండాలని అధికారులకు తగు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఆయన వెంట తాసిల్దార్ టీ. శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పని చేయండి

ప్రజాశక్తి-నెల్లూరు కార్పొరేషన్: విధుల నిర్వహణలో నిబద్ధత పాటించాలని నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది కి సూచించారు. టౌన్ ప్లానింగ్ సిబ్బందితో కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సమీక్ష నిర్వహించారు. విధులలో నిర్లక్ష్యం పనికిరాదని, క్రమశిక్షణ అవసరమని సిబ్బందిని మందలించారు. అత్యవసర సేవలు అవస రమైన సందర్భంలో సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. విధులను క్రమశిక్షణతో నిర్వహించాలని ఉన్నత స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తున్నారని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.



మృతుని కుటుంబానికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు: ప్రయివేట్ సంస్థల అక్రమాలపై చర్యలు తీసుకోవాలని నెల్లూరు జిల్లా ఆటో కార్మిక సంఘం డిమాండ్ చేసింది. కావేరి ట్రావెల్స్ బస్సు ప్రమాదాన్ని పురస్కరించుకొని తోటపల్లిగూడూరు మండలం నరుకూరులో ఆటో కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజా మాట్లా డుతూ కావేరి ట్రావెల్స్ బస్సు ప్రమాదంలో చని పోయిన వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



ప్రజాఉద్యమ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కందుకూరు: మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి కోటి సంతకాల ప్రజా ఉద్యమంలో భాగంగా ఈనెల28న నియోజ కవర్గ కేంద్రాలలో జరగనున్న మహాధర్నాను విజయ వంతం చేయాలని కోరుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కందుకూరు పామూరు రోడ్ లోని వైఎస్ఆర్సిపి కార్యాలయంలో పోస్టర్ను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కంఉకూరు పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ, ఈదర రమేష్, గణేశం గంగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుటేరు ఛానల్ తనిఖీ

ప్రజాశక్తి-గుడ్లూరు: దగ్గర విద్యుత్ కార్యాలయం సమీపంలో లోయర్ ఉప్పుటేరు ఛానల్‌ను కందుకూరు సబ్ కలెక్టర్ హిమవంశీ, ఇరిగేషన్ ఏఈ సీతారామయ్య శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు వలన నీటి ప్రభావం పెరిగి స్థానిక విద్యుత్తు కార్యాలయం దగ్గర కాలువ తెగిపోయి సాగునీరు వృథాగా పోతూ ఉండడంతో విషయం తెలుసుకొని పరిశీలన చేశారు.

బాధితులకు చెక్కులు అందజేత

ప్రజాశక్తి-కందుకూరు: గుడ్లూరు మండలం, దారకానిపాడు ఘటనలో గాయపడిన వారికి ప్రభుత్వం ప్రకటించిన చెక్కులు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గురువారం రాత్రి అంద జేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందిస్తామని ఈ సందర్భంగా ఆయన హామీఇచ్చారు. గుడ్లూరు దుర్ఘటనలో గాయపడిన పవన్ , భార్గవ్ కుటుంబాలను కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరావు గురువారం రాత్రి పరామర్శించారు.

కలెక్టర్, ఎస్‌పిలను మర్యాదపూర్వకంగా కలిసిన 'ఎంఎల్‌ఎ ఇంటూరి'

ప్రజాశక్తి-కందుకూరు: నియోజకవర్గ శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం ఒంగోలులో జిల్లా ఉన్నతాధి కారులను మర్యాదపూర్వకంగా కలిశారు.అందులో భాగంగా, ఎమ్మెల్యే తొలుత జిల్లా కలెక్టర్ పి. రాజా బాబుని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం, జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజుని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుకూరు నియోజకవర్గానికి సంబంధించిన అభివద్ధి పనులు, ప్రజల సమస్యలు,శాంతి భద్రతా అంశాలపై కలెక్టర్, ఎస్పీలతో చర్చించారు.


పోలీసుల అదుపులో కృష్ణసింగ్

ప్రజాశక్తి-నెల్లూరు: నగరంలో పండ్ల వ్యాపారం చేస్తున్న మహేష్ అనే వ్యక్తిని మద్రాసు బస్టాండ్ ప్రాంతంలో కృష్ణసింగ్ బెదిరించి నగదు తీసుకొని పారిపోయినట్లు చిన్నబజారు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో 1వ నగర పోలీసు స్టేషన్ సిఐ కోటేశ్వరరావు అదుపులోకి తీసుకోని విచారణ చేస్తున్నట్లు తెలిపారు. గురువారం రాత్రి 7 గంటల సమయంలో వాహబ్‌పేట ప్రాంతంలోని బండిమీద పండ్లు పెట్టుకొని వ్యాపారం చేసుకుంటున్నానని, అదే సమయంలో అక్కడకు వచ్చిన కృష్ణసింగ్ అనే వ్యక్తి మద్యం సేవించేందుకు తనకు వెయ్యి రూపాయలు ఇవ్వాలని బెదిరించి బలవంతంగా నగదు తీసుకెళ్లాడని కె.మహేష్ ఫిర్యాదు చేశారన్నారు. కృష్ణసింగ్ తనను బెదిరించడాన్ని గమనించిన తన స్నేహితులు పండ్ల వద్దకు రావడాన్ని గుర్తించి ఆ ప్రాంతం నుంచి పారిపోయాడని పోలీసుల ఎదుట వాపోయారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు కృష్ణసింగ్‌ను అదుపులోకి తీసుకోని కోర్టుకు హాజరు పరిచినట్లు సిఐ తెలిపారు.



గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలి

ప్రజాశక్తి-కందుకూరు: గుడ్లూరు మండలం, దారకానిపాడు దుర్ఘటనలో గాయపడిన తిరుమలశెట్టి పవన్ ,తిరుమలశెట్టి భార్గవ్ కుటుంబాలను నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావులు శుక్రవారం మధ్యాహ్నం గుంటూరు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు.ఈ దుర్ఘటనలో గాయపడిన వారితో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. సొంతగా ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబ సభ్యులకు స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దుర్ఘటన చాలా బాధాకరమని, వారి కుటుంబానికి ఎప్పుడూ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.



ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


ప్రజాశక్తి-లింగసముద్రం: మన్నేరు పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ కోటేశ్వరరావు చెప్పారు. రాళ్లపాడు ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండితే ప్రాజెక్టు నీటిని గేట్లు ద్వారా మన్నేరుకు విడుదల చేసే అవకాశం ఉందని చెప్పారు.శుక్రవారం ఆయన తన సిబ్బందితో కలిసి మండలంలోని తునుగుంట, చీమలపెంట, అన్నే బోయిన పల్లి, అంగిరేకులపాడు, వి.ఆర్ కోట గ్రామాల్లో తిరిగి ప్రజలను అప్రమత్తం చేసి దండోరా వేయించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాళ్లపాడు ప్రాజెక్టు నీటిని విడుదల చేస్తే ప్రజలు జాగ్రత్త గా ఉండాలని చెప్పారు, రైతులు,ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. ఇబ్బందికర పరిస్థితులుంటే వెంటనే సమాచారం ఇవ్వాలని, ఆయన వెంట ఆర్ఐ రమణయ్య, విఆర్ఓ అమానుల్లాఖాన్‌లు ఉన్నారు.



మాట్లాడుతున్న తహశీల్దార్

మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన చైర్మన్

ప్రజాశక్తి-నెల్లూరు: నగర పర్యటనకు విచ్చేసిన 20 సూత్రాల కార్యక్రమ చైర్మన్ లంకా దినకర్ శుక్రవారం మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి నివాసానికి చేరుకొని మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా...కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వికసిత్ భారత్ విజన్ 2047 అమలులో మన రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబునాయుడు స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధన దిశగా అమలు చేయనున్న పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై వారు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో అమలు జరుగుతున్న జాతీయ ఆహార భద్రత చట్టం, పూర్తి కావలసిన ఇరిగేషన్ ప్రాజెక్టులు, ఆకాంక్షిత జిల్లాల అభివృద్ధి సూచికలు, పిఎం ధన ధాన్య కృషి యోజన ప్రయోజనాలు అమలు కావలసిన నాలుగు జిల్లాలలో తీసుకోవాల్సిన చర్యలు, నూతన దేవాలయాల నిర్మాణం కోసం పునర్నిర్మాణం కోసం నిధులు తదితర అంశాలపై విపులంగా వీరిరువురి మధ్య చర్చ కొనసాగింది.



కర్నూలు ఘటన దురదృష్టకరం

- ఎంఎల్‌ఎ కావ్య క్రిష్ణారెడ్డి

ప్రజాశక్తి-కావలి : కర్నూలు శివార్లలోని చిన్న టేకూరు వద్ద శుక్రవారం తెల్లవారు జామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై కావలి ఎంఎల్‌ఎ కావ్య క్రిష్ణారెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో ఇద్దరు చిన్న పిల్లల సహా 19 మంది సజీవ దహనం కాగా 27 మంది సురక్షితంగా బయటపడ్డారు. ఇందులో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వింజమూరు మండలం చాకలికొండ పంచాయతీ పరిధిలోని గొల్లవారి పల్లెకు చెందిన రమేష్, అనూషతో సహా వారి ఇద్దరు చిన్నారులు మృతిచెందడం, మనిషితో సహా ఒకే కుటుంబం బలికావడం తీవ్రంగా కలచివేసిందని, ఈ దుర్ఘటన అత్యంత బాధాకరమని ఎంఎల్‌ఎ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బస్సు ప్రమాదంలో మృతి చెందిన వారికి నివాళులు అర్పిస్తూ బాధిత కుటుంబాలకు ఎంఎల్‌ఎ కావ్య క్రిష్ణారెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రమాదానికి గల కారణాలను పూర్తిస్థాయిలో విచారణ చేసి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ఎంఎల్‌ఎ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

బస్సు ప్రమాదం దురదృష్టకరం : సిపిఎం

ప్రజాశక్తి-బిట్రగుంట : కర్నూలు శివార్లలోని చిన్న టేకూరు వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం దురదృష్టకరమని బోగోలు మండల సిపిఎం సీనియర్ నాయకులు తుమ్మల వెంకయ్య తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బోగోలు మండలం సిపిఎం కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ దుర్ఘటనలో ఇద్దరు చిన్న పిల్లల సహా 19 మంది సజీవ దహనం కాగా 27మంది సురక్షితంగా బయటపడ్డారని, ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వింజమూరు మండలం చాకలికొండ పంచాయతీ పరిధిలోని గొల్లవారి పల్లెకు చెందిన రమేష్, అనూషతో సహా వారి ఇద్దరు చిన్నారులు మృతిచెందడం పట్ల సహా ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందడం అత్యంత బాధాకరమని తెలిపారు. ఈ ఘటనలో గాయపడిన వారిని మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ప్రమాదానికి గల కారణాలను పూర్తి స్థాయిలో విచారణ చేసి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని సిపిఎం తరుపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుందన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం బాధాకరం

- టిడిపి నేత చెంచలబాబు యాదవ్

ప్రజాశక్తి-ఉదయగిరి : కర్నూలు జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబ సభ్యులు నలుగురు మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జెడ్‌పి మాజీ ఛైర్మన్ పి చెంచలబాబు యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో వింజమూరు మండలం చాకలికొండ పంచాయతీ పరిధిలోని గొల్లవారిపల్లె గ్రామానికి చెందిన ఒకే కుటుంబ సభ్యులు నలుగురు మృతి చెందడం తీవ్ర ఆవేదనకు గురి చేసిందని, వారు మృతి చెందడం అత్యంత బాధాకరమని ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని కోరుతూ వారి మృతికి సంతాపం తెలిపి వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఉధృతంగా 'ఉల్ల వాగు'



ప్రజాశక్తి-జలదంకి : మండలంలో వర్షాలు తగ్గిన వరద ఉధృతి ఇంకా తగ్గలేదు. శుక్రవారం కూడా గోన్నుపాలెం సమీపంలో గల వస్తాపై ఉళ్ళవాగు వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. దాంతో మండలంలోని జలదంకి తిమ్మ సముద్రం రోడ్డు మార్గంలో రాకపోకలు స్తంభించాయి. ముఖ్యంగా కళాశాలలకు వెళ్లే డిగ్రీ విద్యార్థులకు పరీక్షలు ఉండటంతో వారు వాగు దాటేందుకు నానా అవస్థలు పడ్డారు. ఈ మార్గంలో మండలానికి చెందిన గోపసపాలెం గట్టుపల్లి చింతలపాలెం కేశవరం అన్నవరం దాసరి అగ్రహారం తిమ్మసముద్రం గ్రామాలతోపాటు కనిగిరి మండలానికి చెందిన చిన్న అన్నలూరు దూబగుంట తదితర గ్రామాలకు వెళ్లేందుకు ఈ మార్గమే దిక్కు. అయితే వాగు వరద ఉధృతి వల్ల ద్విచక్ర వాహనాలు ఆటోలు వెళ్లలేకపోయాయి. దాంతో ఈ మార్గంలో ఈ గ్రామాల్లోని పాఠశాలలు వెళ్లే ఉపాధ్యాయులు వెళ్లలేక వెనుతిరిగి పోయారు. తిమ్మసముద్రం మార్గంలోని ఉళ్ళ వాగు వద్ద రాకపోకలు సాగించకుండా జలదంకి ఎస్ఐ లతీఫున్నీసా ఎలాంటి దుర్ఘటనలు జరగకుండా తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

వరి విత్తనాలు సరఫరా చేయాలి

ప్రజాశక్తి-బిట్రగుంట : రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలను వెంటనే సరఫరా చేయాలని బోగోలు మండల వైసిపి కిసాన్ సెల్ మద్దిబోయిన వీరయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వరినాట్లు సీజన్ వచ్చి రైతులందరూ నార్లు పోసుకుంటున్న సమయంలో గత ప్రభుత్వంలో రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలను సరఫరా చేశారు కానీ ప్రస్తుత వర్షాలు పడి రైతులందరూ కూడా ముమ్మరంగా నారుమడులు పోసుకుంటున్నా ఇంతవరకు ప్రభుత్వం నుండి రైతులకు సబ్సిడీలో విత్తనాలు సరఫరా చేయటం జరగలేదని తెలిపారు. రైతులు ప్రైవేట్ వ్యాపారస్తుల దగ్గర విత్తనాలను అధిక ధరలకు కొనుగోలు చేసి తీవ్రంగా నష్టపోవడం జరుగుతుందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు ఇవ్వాలని వైసిపి తరుపున డిమాండ్ చేస్తున్నామన్నారు.

విద్యార్థినులకు అభినందనలు



ప్రజాశక్తి-కోవూరు : నెల్లూరులోని ఎసి స్టేడియంలో శుక్రవారం జరిగిన అండర్-14, అండర్-17 బాస్కెట్ బాల్ జిల్లా జట్టుకు కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల నుండి ఐదుగురు విద్యార్థినులు ఎంపికై తమ పాఠశాల పేరు ప్రతిష్టలు మరింత ఇనుమడింపజేశారని ప్రధానోపాధ్యాయిని సోఫియా కిరణ్మయి తెలిపారు. ఈ మేరకు ఎంపికైన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్-14 విభాగంలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థినులు సంగీత, మన్విక, పావనిలు అండర్-17 విభాగంలో నీతు, స్నేహ మహాలక్ష్మిలు ఎంపికయ్యారన్నారు. వీరిలో దాగి ఉన్న నైపుణ్యాలు వెలికి తీసేలా శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్లు సులోచన, స్వాతి, సునీత, పీఈటీ వెంకటలక్ష్మమ్మలను ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా నిరంతరం కొనసాగించి విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేలా తమ వంతు కృషి చేస్తామన్నారు.

ఆటల పోటీలు వాయిదా

ప్రజాశక్తి-కావలి : డాక్టర్ రామ్‌సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కావలి మండలం, టౌన్ స్థాయి టోర్నమెంట్ వర్షం కారణంగా వాయిదా వేశారు. ఈ పోటీలను నవంబర్ 1, 2, 3 తేదీలలో నిర్వహిస్తున్నామని, ఎంట్రీలు పంపుటకు ఆఖరి తేదీ అక్టోబర్ 31వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు డిపార్ట్‌మెంట్ ఆఫీస్ నందు అందజేయాలని జె.బి. కళాశాల పి.డి. డాక్టర్. ప్రసాద్ రెడ్డి ప్రకటనలో తెలిపారు. అన్ని విద్యా సంస్థలకు డాక్టర్ రామ్ సెంటర్ వాట్సప్ గ్రూపు ద్వారా తెలియజేస్తున్నామన్నారు. క్యులర్ కాంపిటీషన్స్ యథావిధిగా 28 అక్టోబర్ నుండి 30వ తేదీ అక్టోబర్ వరకు, ఎంఎం హాల్‌లో జరుగుతాయన్నారు. వర్షం కారణంగా ఎంట్రీలు ఇవ్వని వారు కూడా ఇందులో డైరెక్ట్‌గా వచ్చి పాల్గొనేందుకు అవకాశం ఇస్తున్నామన్నారు. కావున విద్యాసంస్థల మేనేజ్మెంట్, ప్రిన్సిపాల్స్, హెడ్మాస్టర్స్, పిడిలు, పిఈటిలు అండ్ టీచర్స్ అందరూ గమనించి విద్యార్థిని విద్యార్థులను ప్రోత్సహించి ఈ టోర్నమెంట్‌లో పాల్గొనేటట్టుగా చేసి భవిష్యత్తులో మంచి క్రీడాకారులుగా ఎదిగేందుకు అవకాశాలు కల్పించాలని కోరారు.

పలుచోట్ల ప్రత్యేక ఆధార్ నమోదు



ప్రజాశక్తి-ఉదయగిరి : ఆధార్ సేవా కేంద్రమును మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి.శ్రీనివాసులు మండల విద్యాశాఖ అధికారి తోట శ్రీనివాసులు ప్రారంభించారు. 24వ నుండి 30వ తేదీ వరకు ఈ సేవలు అందించబడతాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.శ్రీనివాసరావు, మహిళా పోలీసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : ఐదు సంవత్సరాలు నిండిన ప్రతిఒక్క విద్యార్థి తప్పనిసరిగా ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవాలని ఇందుకూరుపేట ఎంఇఒ ఎన్‌వి నాయక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని నరసాపురం ఎంపిఎస్ఆర్ పాఠశాల నందు ప్రత్యేక ఆధార్ క్యాంపును ఎంఇఒ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరావు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : పాఠశాలకు వెళ్తున్న పిల్లలకు ఆధార్ కు కొత్తగా చేయడానికి మాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేషన్ కోసం శుక్రవారం నుండి అనంతసాగరం బిజిఎస్ జిల్లా పరిషత్ హై స్కూల్, సోమశిల జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. ప్రస్తుత నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాన్ని ఎంపిడిఒ, ఎంఇఒ పరిశీలించారు.

ప్రజాశక్తి-వింజమూరు : వింజమూరులోని జెడ్‌పి బాయ్స్ హై స్కూల్లో ఆధార్ అప్‌డేట్ స్పెషల్ క్యాంపును ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలో 1400 మంది పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఉచితంగా అప్‌డేట్ కోసం ప్రభుత్వ ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. వింజమూరులోని బాలికల హైస్కూల్‌లో కూడా ఈ క్యాంపు ఏర్పాటు చేసి ఉన్నారని తెలిపారు.

తుపాను షెల్టర్లను సిద్ధం చేయండి..

- అధికారులను ఆదేశించిన ఎంఎల్‌ఎ ప్రశాంతి రెడ్డి



ప్రజాశక్తి-విడవలూరు

తీవ్ర తుఫాన్ హెచ్చరికల వేళ తీర ప్రాంతాన తుఫాన్ షెల్టర్‌లను సిద్ధం చేయాలని కోవూరు ఎంఎల్‌ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అధికారులకు సూచించారు. ఓ వైపు విస్తారంగా కురుస్తున్న వర్షాలు మరోవైపు తుఫాను హెచ్చరికల నేపథ్యంలో కోవూరు నియోజకవర్గ ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోమశిల జలాశయం నుంచి భారీ ఎత్తున వరద నీరు వస్తుండడంతో నియోజవర్గ పరిధిలోని పెన్నానది పరివాహక ప్రాంతాల్లోని కరకట్టల పటిష్టతపై దృష్టి సారించాలని ఆమె అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ముందు జాగ్రత్తగా తీర ప్రాంత గ్రామాలైన మైపాడు, గంగపట్నం, రామతీర్థంలలో సైక్లోన్ షెల్టర్లను తుఫాను బాధితుల కోసం సిద్ధం చేయాలని కోరారు. భారీ వర్షాల కారణంగా ప్రాణ నష్టం, పశు నష్టం జరగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో అధికారులు ఫోన్ 0861 2331261, 7995576699 నెంబర్లతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారని, ప్రజలకు అవాంఛనీయ సంఘటనలు ఎదురైతే పైన తెలిపిన కంట్రోల్ రూమ్ నెంబరుకు ఫోన్ చేయాలన్నారు. ప్రజల భద్రతకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. వైద్య, ఆరోగ్యం, విద్యుత్, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, విపత్తు నిర్వహణ తదితర శాఖల అధికారులు ప్రజలు అందుబాటులో ఉంటారన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రదేశాలకు తరలి వెళ్లాలని, వాగులు, వంకలు, నదులు ఉధృతంగా ప్రవహించేటప్పుడు వాటి సమీపంలో ఉండొద్దని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు, గోడలకు దూరంగా ఉంటూ ప్రజలు సురక్షిత ప్రాంతంలో ఉండాలని, ప్రజల భద్రతకు ప్రభుత్వ అధికారులు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. తడిచిన విద్యుత్ స్తంభాలు, ఇనుప స్తంభాలు, గోడలను ముట్టుకోవద్దని సూచించారు. తుఫాను కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం జరగనున్న నేపథ్యంలో గ్రామాల్లోని వాటర్ ట్యాంకులు నీళ్లతో నింపి పెట్టాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నిత్యం అందుబాటులో ఉంటారని, ఎలాంటి సమస్య ఉన్నా వారిని సంప్రదించాలన్నారు. కూటమి నాయకులు కార్యకర్తలు కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ తగిన రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. తీరప్రాంత మత్స్యకారులు సముద్ర వేటకు వెళ్లొద్దని, వర్షాలు తగ్గేంత వరకు సురక్షితంగా ఉండాలని సూచించారు.

ఉధృతంగా 'కేతా మన్నేరు'



మాట్లాడుతున్న తహశీల్దారు అనిల్‌కుమార్

ప్రజాశక్తి-మర్రిపాడు

తీవ్ర తుఫాను ప్రభావంతో గడిచిన రెండు రోజులుగా మండల వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలను దృష్టిలో ఉంచుకొని పడమటి నాయుడుపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కేతామన్నేరు వాగును తహశీల్దార్ అనిల్‌కుమార్ యాదవ్ శుక్రవారం పరిశీలించారు. ప్రమాదకర మైన పరిస్థితులను అంచనా వేస్తూ ప్రజలను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా భారీ వర్షాలు కురిసినప్పుడు వాగులు ఉధృతంగా మారినప్పుడు ప్రజలు వాటి దగ్గరకు వెళ్లవద్దని సూచించారు. ఒక గంట కురిసిన వర్షానికి గ్రామం మధ్యలో ఆదిలో నుండి కేతామన్నేరు వాగులోకి కలిసే వంక ప్రజలను దాటానివ్వక పోయిన విషయం గ్రామస్తులు తహశీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. వంకకు అడ్డంగా కరకంచ చెట్లు ఉండటంతో మనుషులను దాటడానికి వీళ్లేకుండా నీళ్లు దారికి అడ్డంగా ఉధృతంగా ప్రవహిస్తున్నాయని తెలిపారు. ఈ విషయంపై తహశీల్దార్ సానుకూలంగా స్పందిస్తూ ఈ విషయాన్ని పరిశీలించి చెట్లను తొలగించే విధంగా చూస్తామని గ్రామస్తులకు తెలిపారు. వర్షాలు ఎక్కువగా ఉన్నప్పుడు వాగులు దాటడానికి ప్రయత్నించొద్దన్నారు. అవసరమైనప్పుడు ఇతర అధికారులతో సమన్వయం చేసుకుని, సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని గ్రామస్తులకు తెలియజేశారు.

సచివాలయంలో సందర్శన

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలోని సోమశిల గ్రామ సచివాలయాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఐజాక్ ప్రవీణ్ సందర్శించారు. సిబ్బంది హాజరు పరిశీలించారు. మండలంలో అత్యధిక వర్షపాతం నమోదవుతున్నందున సచివాలయ సిబ్బంది కార్యాలయంలో అందుబాటులో ఉండి స్థానిక ప్రజా ప్రతినిధులు నాయకులతో కలిసి ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాలు తగ్గిన వెంటనే పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని తెలియజేశారు. విఆర్ఒ, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్, పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ కూడా అందుబాటులో ఉండి తమ శాఖలకు సంబంధిం చి ప్రజలకు సూచనలు సలహాలు అందజేయాలని కోరారు.



ఎంపి వేమిరెడ్డికి వివరాలు తెలియజేస్తున్న ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్

మృతుని కుటుంబ సభ్యులకు ఎంపి విపిఆర్ పరామర్శ

ప్రజాశక్తి-వింజమూరు

కర్నూలు బస్సు ప్రమాద ఘటనలో మృతి చెందిన వింజమూరు మండలం గోళ్లవారిపల్లెకు చెందిన గోళ్ల రమేష్ కుటుంబ సభ్యుల బాధ వింటే గుండె తరుక్కుపోతోందని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. ప్రమాదంలో మృతి చెందిన రమేష్ తండ్రి మాల కొండయ్యను ఉదయగిరి ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్‌తో కలిసి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. ఆయనకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రమాదంలో రమేష్, భార్య అనూషతో పాటు ఇద్దరు చిన్నారులు కూడా మతి చెందటం కలచి వేసిందన్నారు. ఇలాంటి పరిస్థితి మరెవరికీ రాకూడదన్నారు. కోల్పోయిన వ్యక్తిని తిరిగి తీసుకురాలేమని కానీ ఆ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. తన తరఫున ఆ కుటుంబానికి రూ.5లక్షలు అందజేస్తానని తెలిపారు. ఎలాంటి పరిస్థితుల్లో అయినా తప్పకుండా తాము సహాయం చేసేందుకు ముందుంటామని వెల్లడించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కేతంరెడ్డి వినోద్ రెడ్డి, రవీంద్ర రెడ్డి, ఉదయగిరి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాలేపాటి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-దగదర్తి

ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆగ్రో ఛైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు, దగదర్తి టిడిపి యువ నాయకుడు మాలేపాటి భానుచందర్ హఠాత్తుగా గుండెపోటుతో మృతి చెంది వారి కుటుంబాలలో అభిమానులు కార్యకర్తలలో తీవ్ర విషాదన్ని నింపింది. విషాదం జరిగిన సమయంలో అత్యవసర పనులలో ఉన్న మున్సిపల్ శాఖ మంత్రి పొంగులేటి నారాయణ శుక్రవారం మాలేపాటి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబం మనోధైర్యం కలిగి ఉండాలని సుబ్బానాయుడు మన మధ్య లేకపోవడం, యువకుడైన పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న మాలేపాటి భానుచందర్ ఆకస్మిక మృతి చాలా బాధాకరమన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలో లేనప్పుడు కావలి ఇన్‌ఛార్జిగా ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గం ఇన్‌ఛార్జి అబ్దుల్ అజీజ్, బీద గిరిధర్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే పనులు తనిఖీ

ప్రజాశక్తి-దగదర్తి

మండలంలోని వెలుపోడు గ్రామంలో జరుగుతున్న రీ సర్వే కార్యక్రమం పనులను సర్వే శాఖ ఏడీ రఘురామ రాజు తహశీల్దారు పి.కృష్ణతో కలిసి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వే జరుగుతున్న పరిసర ప్రాంతాల్లోని రైతులను పిలిచి రీసర్వే జరుగుతున్న తీరును సర్వే అధికారులు రెవెన్యూ అధికారులు వ్యవహార శైలి తదితరాలను అడిగి తెలుసుకున్నారు. రీసర్వే జరుగుతున్న ప్రాంతాలలో ఆ రైతులు తమ వద్ద ఉన్న ఆధారాలను చూపి రీసర్వే సక్రమంగా జరిగేలా రికార్డులలో పొరపాట్లు దొర్లకుండా ఉండేలా అధికారులకు సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అదేవిధంగా పక్క పొలాల రైతుల భూముల విషయంలో పొరపాట్లు దొల్లకుండా ఉండేలా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సర్వే శాఖ సిబ్బందికి సూచించారు. గతంలో జరిగిన రీసెర్వేలో మాదిరి కాకుండా అక్రమాలకు ఆస్కారం లేకుండా తప్పులు దొరలకుండా రీసర్వే కార్యక్రమాన్ని పక్కాగా పారదర్శకంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కావలి డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే నరసింహమూర్తి, మండల సర్వేయర్ షేక్ రబియా, విలేజ్ సర్వేయర్లు వసంత, దయాకర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్వే శాఖ ఏడీ రఘురామరాజు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి-బిట్రగుంట

ప్రజలు సీజనల్ వ్యాధులు బారిన అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్‌కె ఖాదర్ వలీ పేర్కొన్నారు. గత కొన్ని రోజుల నుండి ఎడతెరప లేకుండా కురుస్తున్న వర్షాలకు వచ్చే సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని బోగోలు మండలం కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ జిహారిక, డాక్టర్ నిత్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖాదర్ వలీ మాట్లాడుతూ భారీ వర్షాలు కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కాచి చల్లార్చిన నీటిని తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదని, దోమల కారణంగా వచ్చే డెంగీ, మలేరియా, ఫైలేరియా వంటి విష జ్వరాన బారిన పడకుండా ఇళ్లల్లో మస్కిటో కాయలను, దోమతెరలను ఉపయోగించాలని తెలిపారు. జ్వరం, జలుబు, తలనొప్పి ఒళ్ళు నొప్పులు వంటివి అనారోగ్యంగా సమస్యలు తలెత్తితే వెంటనే ఆలస్యం చేయకుండా పిహెచ్‌సి సెంటర్‌లోని డాక్టర్‌ను సంప్రదించాలి వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. లెప్రసీ, టీబీ, నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ 4..0, డెలివరీస్, సీజనల్ వ్యాధులపై ఆరోగ్య సిబ్బందితో సమీక్ష కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఒ నజీ మునిసా, సిహెచ్ఒలు, ఎఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ ఖాదర్‌వల్లీ

వక్ఫ్‌బోర్డు ఆస్తిని కాపాడాలని వినతి

ప్రజాశక్తి-ఎఎస్‌పేట



మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఖాజా నాయబ్ రసూల్, దొరసానమ్మ వెలసి ఉన్న ఎఎస్‌పేటలో దొరసానమ్మ తోట కబ్జాకు గురికాకుండా చూడాలని సయ్యద్ హసన్ ఇబ్రహీం హుసేని అర్జీలు సమర్పించినట్లు తహశీల్దారు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఎస్‌పేటలో దొరసానమ్మ తోటగా పేరు పొందిన స్థలం 126 సర్వే నెంబరులో 6 ఎకరాల 45 సెంట్లు సయ్యద్ హసన్ ఇబ్రహీం హుసేని అను వ్యక్తి పేరుతో ఉన్నదని, వారి కుటుంబీకులు ఆ ఆస్తిని టెడిటరీ వక్ఫ్‌బోర్డుకు అప్పజెప్పడం జరిగిందని, తెలిపారని, అదేవిధంగా గురువారం ఆ స్థలంలో రెండు ఎకరాలు మాదంటూ ధనుంజయ అను వ్యక్తి నిన్న జంగిల్ క్లియరెన్స్ చేయడం జరిగిందని, రెండు మూడు పేర్లతో ఇటీవల రిజిస్టర్ అయిన డాక్యుమెంట్లు కూడా చూడడం జరిగిందని, దానిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పూర్తిగా రికార్డులను పరిశీలించి, అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలియజేశారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలోని శర్మల గ్రామ పంచాయతీలో అతి పురాతనమైన శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో గురువారం రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారని ఎస్ఐ ఎ.సైదులు, దేవాలయ పూజారి సురేష్ స్వామి పత్రిక ముఖ్యంగా తెలియజేశారు. అనంతరం గుడి పూజారి మాట్లాడుతూ చిరమణలోని పురాతన దేవస్థానమైన చంద్రమౌళీశ్వర స్వామి వారి గుడి తాళాలు పగలగొట్టి, గర్భగుడిలో ఆగ్నేయం వైపు ఉన్న ఓ రాయిని తొలగిస్తే, గుప్తనిధులు దొరుకుతాయని ఉద్దేశంతో ఆ రాయిని తొలగించుటకు సర్వ విధాల ప్రయత్నం చేసి ఆ రాయి రాకపోవడంతో, వెనుదిరిగి వెళ్లిపోయారని తెలిపారు. ఇదే విషయంపై ఎస్ఐ మాట్లాడుతూ దేవాలయంలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలు, డివిఆర్ తదితర రూ.15వేల వస్తువులను తీసుకొని వెళ్లడం జరిగింది. మరి ఎలాంటి ఇతర వస్తువులు చోరీకి గురికాలేదని తెలియజేశారు. చోరీ చేసిన వారి ఆచూకీ కొరకు క్లూస్ టీం, సిసిఎస్ టీం, సంఘం సర్కిల్ సీఐ వేమారెడ్డి, ఇతర దొంగల ఆచూకీ కనుగొని మరి కొంతమంది పోలీసులు దేవాలయ ప్రాంగణమంతా జల్లెడ పట్టడం జరిగిందని తెలిపారు.

వసతి గృహాల్లో ఆకస్మిక తనిఖీలు



ప్రజాశక్తి-మర్రిపాడు

స్థానిక బాలుర, బాలికల వసతి గృహాలను జిల్లా ఎస్‌సి సంక్షేమ, సాధికారిత అధికారిణి కె.శోభా రాణి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ సక్రమంగా అందుతుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆమె పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వర్షాకాలం మొదలైనందున వేడి ఆహారం, కాచి చల్లార్చిన నీరు ఇవ్వాలని సంక్షేమాధికారులను ఆదేశించారు. వసతి గృహాలలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వసతి గృహాల్లో 10వ తరగతి విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరడంతో వెంటనే ప్రయివేట్ బిల్డింగ్‌లోకి మార్చాలని ఆదేశించారు. ఎఎస్‌డబ్ల్యూ కె.రమణా రెడ్డి వార్డెన్లు షేక్ మహమ్మద్ అలీ, టి.సూర్యకుమారి ఉన్నారు.

విద్యుత్‌శాఖ ఎఇ తనిఖీలు

ప్రజాశక్తి-కోవూరు :



కోవూరు టౌన్, రూరల్ పరిధిలో విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ కె.రాఘవేంద్రం శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కోవూరు టౌన్, పాటూరు గ్రామం ప్రాంతాల్లో విద్యుత్ బకాయిలు ఉన్న వినియోగ దారుల డిస్కనెక్షన్ జాబితాను పరిశీలించడంతో పాటు, విద్యుత్ సరఫరాలోని లోపాలను ప్రత్యక్షంగా గమనించారు. అనంతరం స్థానిక ఇంజనీర్లు, లైన్‌మెన్, రెవెన్యూ సిబ్బందితో సమావేశమై ఎస్.ఇ. పలు ముఖ్య సూచనలు జారీ చేశారు.

వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-కోవూరు : కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా విద్యార్థినులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను కోవూరు ట్రైనీ ఎస్ఐ అనూష పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయినీ సోఫియా కిరణ్మయి, హెడ్ కానిస్టేబుల్ సతీష్, ఉపాధ్యాయులు ఉన్నారు.




రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి-దగదర్తి

గత రెండు రోజుల నుంచి ఎడ తెరప లేకుండా కురుస్తున్న భారీ వర్షాల వల్ల దగదర్తి మండలం చౌటపుట్టేడు నుంచి శ్రీరాంపురం పోయే రోడ్డు మార్గం పిల్లివాగు పొంగి రోడ్డు కొట్టుకుపోయింది. ఈ మేరకు ఎస్ఐ జంపాని కుమార్, సర్కిల్ ఇన్స్పెక్టర్ పాపారావు సంఘటన స్థలానికి చేరుకొని వాగు దాటకుండా ఉండేందుకు ముళ్ళకంపను అడ్డం వేశారు. పోలీస్ సిబ్బందిని గస్తీకాస్తున్నారు. వాగు ఉధృతిగా ప్రవహించడంతో గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గ్రామ సర్పంచ్ పులి సీనయ్య, విఆర్ఒ సుధాకర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-వింజమూరు : మండల పరిధిలోని మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు తమ ఆవేదాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాల ప్రభావంతో వింజమూరు మండల పరిధిలోని బుక్కాపురం కోకవారిపాలెం గ్రామాలలో మొక్కజొన్న పంటను విరివిరిగా రైతులు సాగు చేసి ఉన్నారు. ఈ ఇటీవల కురిసిన వర్షాలకు పంటకు వచ్చిన మొక్కజొన్న తోటలో పడిపోయి కొన్నిచోట్ల పంటను ఆరబెట్టి ఉన్నందువల్ల తడిసి మొక్కలు రావడం జరిగింది. ఈ పంటను కొనుగోలుదారుడు వ్యాపారం చేయలేక తిరిగి వెళ్ళిపోతున్నారు. దానివల్ల మొక్కజొన్న పంట రైతులు భారీ నష్టాల్లో కూరుకుపోయి ఉన్నారు. ఈ సందర్భంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముద్దుల రాజగోపాల్ రెడ్డి పంట రైతుల వద్దకు వెళ్లి అక్కడ పంటను పరిశీలించి పంట నష్టాన్ని వింజమూరు అగ్రికల్చర్ ఏడీ దృష్టికి తీసుకొచ్చారు. కావున ప్రభుత్వం వెంటనే స్పందించి వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న రైతులకు ఆర్థిక సహాయాన్ని అందించి ఆదుకోవాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు ఎం రాజగోపాల్ రెడ్డి, మండల కన్వీనర్ జగదీశ్ రెడ్డి రైతులు పాల్గొన్నారు.



మొక్కజొన్నను పరిశీలిస్తున్న నాయకులు

జెండా ఉత్సవం

ప్రజాశక్తి-ఎఎస్‌పేట :



మండలంలోని గండువారి పల్లిలో ఆస్థానే ఖాద్రి చమన్ మహబూబియా 15వ జెండా ఉత్సవ కార్యక్రమం సయ్యద్ మహబూబ్ బాషా స్వామివారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శిష్యులు, భక్తులు గ్రామ ప్రజలు పాల్గొని, స్వామివారి ప్రసాదములు స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ... నవంబర్ 13వ తేదీ గంధ మహోత్సవము, 14 చిరాగా దీపాలంకరణ, 15వ తేదీ తహలీల్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు.




పాడి పరిశ్రమతో మహిళలు అభివృద్ధి

ప్రజాశక్తి-ఉదయగిరి

ప్రభుత్వం అందజేస్తున్న పాడి పరిశ్రమలతో పొదుపు మహిళలు మరింతగా అభివృద్ధి చెందవచ్చని పశుసంవర్ధక శాఖ ఎడిఎ శశిధర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో ఎపిఎం కె శారా స్రవంతి ఆధ్వర్యంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి వెలుగు కార్యనిర్వాహణ సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు చేసే ప్రతి మహిళ కుటుంబం ఆర్థికంగా అభివద్ధి చెందేందుకు పోషణ విధాన పెంపొందించేందుకు ప్రతి కుటుంబానికి జీవనోపాధి కల్పించేందుకు ఈ సమావేశం నిర్వహించి పాడి పశువులు వాటి పోషణ విధానంపై అవగాహన కల్పించారు. ప్రతి మహిళ తమ కుటుంబాన్ని ఆర్థికంగా అభివద్ధి చేసేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం వెలుగు సిబ్బందితో ఎపిఎం కె.శారా స్రవంతి సమీక్ష సమావేశం నిర్వహించి అన్ని రకాల రికవరీలను సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. ఎన్.డి.కె 2.0 పై స్త్రీనిధి రికవరీ సిబ్బందితో జరిగిన పనులపై రివ్యూ నిర్వహించి సూచనలు చేశారు. కార్యక్రమంలో సిసిలు విఒఎలు, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నక్కల వాగు బ్రిడ్జిపై వరదనీరు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట :



ఎఎస్‌పేట గ్రామంలోని నక్కల వాగు బ్రిడ్జిపై వరద నీరు ప్రవహించడంతో, ఎఎస్‌పేట నుంచి నెల్లూరుకు రాకపోకలు ఉదయం తొమ్మిది గంటల నుంచి స్తంభించిపోయినాయి. నెల్లూరు నుంచి ఎఎస్ పేటకు వస్తున్న ఆర్‌టిసి బస్సు సర్వీసులు సైతం వాగు అవతలనే ఆపివేయడం జరిగింది. నక్కలవాగు వస్తుండడంతో, ఎస్ఐ ఎ.సైదులు వాగుకు రెండువైపులా భారీ ఎత్తున కంప వేసి, రెండువైపులా పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసి, ఎవరు కూడా రోడ్డుపై వెళ్లనివ్వకుండా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, సుమారు సాయంత్రం వరకు కట్టుదిట్టం చేశారు. దానివల్ల నెల్లూరు నుంచి ఎఎస్‌పేటకు వచ్చే అధికారులు సైతం, వెనుతిరిగి మరల ఆత్మకూరు వెళ్లి అక్కడ నుంచి ఎఎస్‌పేటకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదేవిధంగా ఎఎస్‌పేటకు వివిధ పనుల నిమిత్తం ఏఎస్ పేటకు వచ్చిన మండల పరిధిలోని జమ్మవరం, గుంపర్లపాడు, చందలూరుపాడు, చిరమణ తదితర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనడం జరిగింది. చిన్నపాటి వానకి ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయి కావున ఇకనైనా సంబంధిత అధికారులు ఈ విషయాన్ని గమనించి, పవిత్ర పుణ్యక్షేత్రమైన ప్రసిద్ధిగాంచిన ఎఎస్‌పేటకు వచ్చే యాత్రికులకు ఇలాంటి పరిస్థితులు మున్ముందు ఎదురు కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉందని గ్రామస్తులు తెలియజేస్తున్నారు.

In The Court of The III[rd] Addl. Junior Civil Judge : Nellore

O.S.No. 210 / 2024

Avadhanam Sampath Kumar - Plaintiff

Vs

1. Machireddy Rajani
and 4 others - Defendants

Notice

To
D5. Duvvuru Varalakshmi,
W/o **Govardhana,** Nawabpet, Nellore.
Represented by her GPA Agent
Battala Chandraiah, S/o **Chengaiah,** Flat No.402, Padmaplaza, Apartment, Tanapalli Road, Padmavathipuram, Tirupathi, Cittoor District.

పై నెంబరు కేసులో వాది మీ మీద పైవారి కోర్టులో దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తే23-12-2025ది** కి వాయిదా వేసియున్నారు. ఆ రోజు **ఉదయం 10.30 గం॥లకు** మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

Shaik Arif Malik
Kameela Malik Pathan
Advocate for Plaintiff, Nellore

మహారాజశ్రీ 6వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో : నెల్లూరు

E.P.No. 183 / 2024

O.S.No. 131 / 2017

నెల్లూరు రఘురామిరెడ్డి - డిక్రీ హోల్డరు

Vs

1. వెలికంటి వెంకటరత్నం
మరియు నలుగురు - జడ్జిమెంటు డెట్టర్సు

వేలం ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా పై డిక్రీ హోల్డరు ఇ.పి. బాకీ రాబట్టుకొనుటకు దాఖలు చేసిన పై ఇ.పి.లో ఈక్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్థిని పై కోర్టు వారి సమక్షములో **తే14-11-2025** దిన **ఉదయం 10.30 గంటల** నుండి **సాయంత్రం 5 గంటల** లోపల పై తెలిపిన కోర్టులో బహిరంగ వేలం పాట జరుపబడును. కావున పాట దారులు ఎవ్వరైనా వేలం పాటలో పాల్గొని పాట పాడుకొనవచ్చును.

ఆస్తి షెడ్యూలు

ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా, నెల్లూరు సబ్ రిజిస్ట్రేషన్, నెల్లూరు మండలం, నెల్లూరు బిట్-1 గ్రామం, ప్రస్తుతం: నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ లిమిట్స్, నెల్లూరు సిటీ.

అయిటం నెం.1. సర్వే నెం.2071-3, ప్లాటు నెం.10, 33 1/4 అంకణములు లేక 225.753 చదరము మీటర్లు ఖాళీ స్థలం. **హద్దులు: తూర్పు:** చిన్ని వీరయ్య వగైరాల స్థలం, **దక్షిణం :** ప్లాటు నెం.11, **పడమర:** లే అవుట్ రోడ్డు, **ఉత్తరం:** ప్లాటు నెం.9.

అయిటం నెం.2. సర్వే నెం.2071-3, ప్లాటు నెం.7, 33 1/4 అంకణములు లేక 225.753 చదరము మీటర్లు ఖాళీ స్థలం. **హద్దులు: తూర్పు:** చిన్ని వీరయ్య వగైరాల స్థలం, **దక్షిణం :** ప్లాటు నెం.8, **పడమర:** లే అవుట్ రోడ్డు, **ఉత్తరం:** ప్లాటు నెం.6.

రెండు అయిటములు మార్కెట్ విలువ : రూ.25,92,000/-
డిక్రీ హోల్డర్ విలువ : రూ.30,00,000/-
అమీనా విలువ : రూ.36,00,000/-

F.H. 21-11-2025

కె. అనంత సత్యనారాయణ
ఎస్‌పి.ఎస్.విజయసారథి
డిక్రీ హోల్డర్ తరపు న్యాయవాదులు, నెల్లూరు.
సెల్: **9885592837**